

గంగావతిలో గాలింపు..!



- ఎమ్మెల్యే అభ్యర్థి కోసం ఇరు పార్టీల వేట..!
- బీజేపీ నుంచి గాలి లక్ష్మీఅరుణ.. కాంగ్రెస్ నుంచి ఇక్బాల్ అన్సారీ
- జోరందుకున్న ఊహాగానాలు


గాలి లక్ష్మీ అరుణ

బళ్లారి, మే 15(ఆంధ్రజ్యోతి): గనుల అక్రమాల కేసులో గాలి జనార్దన్ రెడ్డి జైలుకెళ్లడంతో గంగావతి ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయింది. దీంతో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ అభ్యర్థుల వేటలో అప్పుడే బిజీగా మారాయి. గాలి జనార్దన్‌రెడ్డి అక్రమ గనుల కేసులో సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన నేపథ్యంలో కర్నాటక శాసనసభ గాలి జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్యే అనర్హత వేటు వేసింది. దీంతో గంగావతి శాసనసభ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తే బరిలోకి ఎవరిని దించాలి అనే చర్చ జోరందుకుంది. గాలి జనార్దన్‌రెడ్డి శాసనసభ ఎన్నికల ముందు సొంత పార్టీ స్థాపించారు. కల్యాణ కర్ణాటక ప్రగతి పార్టీ(కేకేఆర్‌పీ) నుంచి ఆయన పోటీ చేసి గెలిచారు. రాష్ట్రంలో 152 స్థానాల్లో కేకేఆర్‌పీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులు కేవలం గంగావతిలో గాలి జనార్దన్ రెడ్డి ఒక్కడే గెలిచారు. ఒక ఆయన కూడా పార్టీ మూసేసి మళ్లీ బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఓబుళాపురం ఇనుప గనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ కోర్టు ఈనెల 6న గాలిని దోషిగా నిర్ధారిస్తూ తీర్పు నిచ్చింది. ఆయనతోపాటు మొత్తం నలుగురు ప్రస్తుతం హైదరాబాద్ చంచల్‌గూడ జైల్లో దోషులుగా ఉన్నారు. ఏడేళ్ల శిక్షను విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పు రావడంతో విధానసభలో ఆయన ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే.

- ఉప ఎన్నికల్లో కమలం నుంచి ఎవరిని నిలపాలి అనే ఆలోచన చేస్తున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి భార్య గాలి లక్ష్మీఅరుణను బరిలోకి దింపాలని బీజేపీ నాయకులు యోచిస్తున్నారు. రెండు రోజుల క్రితం కేంద్ర, రాష్ట్ర బీజేపీ కమిటీలో ఇదే విషయమపై చర్చలు జరిపారని విశ్వసనీయ సమాచారం. ఆమే కాదు అనుకుంటే లింగాయత్ సమాజ వర్గంము కానీ కురుబసామాజిక వర్గం నుంచి పోటీలో దింపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్‌లో కూడా చర్చలు సాగించారు. గత ఎన్నికల్లో గాలిపై పోటీ చేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారీని కానీ, లింగాయత్, కురుబ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కానీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల తరువాత గంగావతి ఎమ్మెల్యే స్థానానికి ఉప ఎన్నికలు జరిగితే ఎలాగైనా ఈ ఈసారి విజయం సాధించాలని ఇరు పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభ్యర్థుల విషయంలో ఇరు పార్టీలు ఆచితూచి అడుగులేస్తున్నాయి. ఇక జనతాదళ్ కూడా ఒక అభ్యర్థిని నిలిపే ప్రయత్నం చేస్తుందా లేదా ఎలాగో బీజేపీ మిత్రపక్షంగా ఉంది కాబట్టి బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇస్తుందా అనేది తేలాల్సి ఉంది. మొత్తానికి జిల్లాలో మళ్లీ ఎన్నికల సందడి నెలకొందని చెప్పవచ్చు.


ఇక్బాల్ అన్సారీ

సిందూర్‌కు.. విరామమే..!

- ఆపరేషన్ సిందూర్‌ను ఆపేదిలేదు
- తోక జాడిస్తే పాకిస్తాన్‌కు గుణపాఠం తప్పదు
- సైనికులను అభినందించేందుకే తిరంగా యాత్ర: బీజేపీ నేత రాధామోహన్‌దాస్ అగర్వాల్


జాతీయ పతాకంతో విద్యార్థిని


తిరంగాయాత్రలో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ముగియలేదని, ఇది కేవలం విరామమేనని, పాకిస్తాన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీసిన మన దేశ సైనికులకు ధన్యవాదాలు తెలిపేందుకే దేశమంతటా తిరంగాయాత్ర చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం వయ్యాలికావల్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద తిరంగా యాత్ర ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల కిరాతకానికి ప్రతీకారంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి భారత్‌వైపు కన్నెత్తి చూసేందుకు భయపడేలా పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పేలా ఆపరేషన్ సిందూర్ చేపట్టారన్నారు. త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయన్నారు. సింధూనది నీటి ఒప్పందానికి భారత్ వ్యతిరేకమన్నారు. కదనానికి విరామం మాత్రమే అన్నారు. ఉగ్రవాద చర్యలు కొనసాగితే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైమానిక దాడుల ద్వారా కేవలం కొన్నిగంటల్లోనే 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన ఘనత మన సైనికులదన్నారు. ఉగ్రవాదులు మినహా పాకిస్తాన్‌కు చెందిన ఒక పౌరుడిని కూడా చంపలేదన్నారు. మాజీ ఎయిర్ మార్షల్ ఏపీ మురళి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ముగియలేదని మరోసారి పాకిస్తాన్ అతిగా ప్రవర్తిస్తే పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడం ఖాయమన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ సాధించడమే లక్ష్యమన్నారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల అభ్యంతరాల గురించి స్పందించాల్సిన పని లేదన్నారు. కశ్మీర్‌లో తలదాచుకున్న ఉగ్రవాదులు ముగ్గురు హతమారలేదా అని ప్రశ్నించారు. దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటమే కాంగ్రెస్ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్‌తో పాటు ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు


భారీ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అభివృద్ధి శూన్యం..!

- నిస్తేజంగా తుమకూరు వర్సిటీ
- రెండు దశాబ్దాలైనా వీడని గ్రహణం
- విడుదల కాని నిధులు

తుమకూరు యూనివర్సిటీ


బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో కొనసాగినా ఉన్నత విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నాయి. గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లాకొక విశ్వవిద్యాలయం అనే కాన్సెప్ట్ కొనసాగిస్తోంది. తుమకూరు విశ్వవిద్యాలయం ప్రాంభమై రెండు దశాబ్దాలైంది. అయితే గ్రాంట్ల కొరత కారణంగా క్యాంపస్ నిర్మాణం సహా అభివృద్ధి విషయంలో విశ్వవిద్యాలయం కుంటుతోంది.

సీఎంకు ప్రతిపాదనలు పంపినా..

జ్ఞానసిరి క్యాంపస్ అభివృద్ధికి రూ.260కోట్లు అవసరం ఉందని ఇప్పటికే కులపతి సహా తుమకూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఇంతవరకు గ్రాంటు గురించి ప్రభుత్వం స్పందించలేదు. ప్రారంభం నుంచి సరైన ఆదాయం లేకపోవడంతో మౌలికసదుపాయాలు, విద్యాసాధనవైపు అడుగులు వేయడం కష్టంగా మారిందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి 12(బి) గుర్తింపు, న్యాక్ నుంచి 'బి+' గ్రేడ్ పొందడం ద్వారా పరిశోధనలకు అవసరమైన గ్రాంట్లు పొందడంలో విజయవంతమైంది. దీనికితోడు యూజీసీ నుంచి జాతీయ ఉత్కృష్టతా సంస్థగా గుర్తింపు పొందడంలో సఫలమైంది. అయినా నిధుల విడుదలలో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణం.

అరకొరగా గ్రాంట్లు

గ్రాంట్లు ఇచ్చే విషయంలో ఈ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భావిభారత ప్రజలను విద్యావంతులుగా, జ్ఞానవంతులుగా రూపొందించడంలో విద్యాదేవాలయాలైన యూనివర్సిటీలకు గ్రాంట్లు ఇవ్వడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని జిల్లా విద్యావంతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

సుమారు 10 సంవత్సరాల క్రితం తుమకూరు గ్రామీణలోని బిదరకట్టె కావల్‌లో సుమారు 240 ఎకరాలను విశ్వవిద్యాలయానికి స్థలమిచ్చి నూతన క్యాంపస్‌కు 'జ్ఞానసిరి'ని ప్రారంభించారు. ప్రభుత్వం కాలానికి అనుగుణంగా గ్రాంట్లు ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. అన్నీ అనుకున్నట్టుగా జరిగియుంటే సమగ్రమైన విశ్వవిద్యాలయం నిర్మాణమై ఉండేది. అయితే గ్రాంట్ల కొరతతో మందగతిన సాగుతోంది.

సమగ్ర అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు

అన్ని హంగులు, సదుపాయాలతో కూడిన విశ్వవిద్యాలయం నిర్మాణం కావాలంటే వెయ్యి కోట్ల రూపాయలు అవసరం ఉంది. అయితే ఇంతవరకు కేవలం 50 కోట్లు మాత్రమే గ్రాంటు మంజూరైంది. 2016లో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ఉన్న బసవరాజయరెడ్డి అప్పట్లో వర్సిటీ అభివృద్ధి కోసం రూ.80కోట్లు ప్రస్తావించారు. అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది రూ.40కోట్లు మాత్రమే. ఆ మొత్తాన్ని కూడా నాలుగు సంవత్సరాలలో 4 కంతులుగా ఇచ్చింది. ఈమొత్తాన్ని కలిపితే ఇంతవరకు లభించింది రూ.50 కోట్లు మాత్రమేనని అధికారులు అంటున్నారు. ఒక సమగ్రమైన విశ్వవిద్యాలయం నిర్మాణానికి వెయ్యికోట్లు అవసరం



కానుంది. కొత్త క్యాంపస్ ప్రారంభమై పదేళ్ల గడిచాయి. ప్రస్తుతానికి 10 విభాగాలు మాత్రమే మారాయి. 21 విభాగాలు ఉండగా, కొత్తగా 19 కోర్సులు ప్రారంభించే ఆలోచన ఉంది. వాటిని ప్రారంభించడానికి కొత్త భవనాల అవసరం ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నిర్మాణ పనులు ప్రారంభించవచ్చునని తుమకూరు వర్సిటీ కులపతి వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. కొత్త క్యాంపస్ భవనాలలో 3 ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లు, 1 జనరల్ హాస్టల్, 1 అకడమిక్ బ్లాక్ ఉన్నాయి. కాగా అల్పాహారం కోసం కెఫెటేరియా, కళాభవనం, పరీక్షా పూర్వ తర్ఫీదు కేంద్రం, ఇండోర్ స్టేడియం, లైబ్రరీకి సంబంధించి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. స్థలం కోసమే దశాబ్దాల పోరాటం

సుదీర్ఘ పోరాటంతోనే..

యూనివర్సిటీ ఏర్పాటుకోసం దశాబ్దాలపాటు పోరాటం చేయాల్సి వచ్చింది. 2004 ఫిబ్రవరి 21న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ చొరవతో తుమకూరు విశ్వవిద్యాలయం మంజూరైంది. ప్రారంభంలో తుమకూరు ఎంజీ రోడ్డులోని అంబేడ్కర్ భవనాన్ని పాలనా కార్యాలయానికి కేటాయించారు. అంతేకాక దేవరాయనదుర్గ అడవుల్లో 300 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే పర్యావరణ ప్రేమికులనుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ స్థలాన్ని వీడి మరో స్థలం కోసం వెదుకులాట ప్రారంభించారు.
విశ్వవిద్యాలయం ప్రారంభమై రెండు దశాబ్దాలైనా తగిన స్థలం కోసం పదేళ్లపాటు వేచియుండాల్సి వచ్చింది. కొరటగెరె, మధుగిరి, శిరా, తిపటూరు ఇలా పలు చోట్ల క్యాంపస్ స్థలం కోసం వెదికినా లభించలేదు. అటవీ ప్రదేశం లేదా గోమాళ భూమి ఇలా పలు కారణాలతో సాధ్యం కాలేదు. చివరకు తుమకూరు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని బిదరకట్టె కావల్‌లోని 240 ఎకరాల స్థలాన్ని విశ్వవిద్యాలయానికి అప్పగించారు. స్థలం ఎంపిక చేయడమే ఒక కష్టంగా ఉంటే క్యాంపస్ నిర్మాణానికి నిధులు సమకూర్చడం మరో సమస్యగా ఉంది.
తుమకూరు విశ్వవిద్యాలయం సంస్థాపక కులపతి ప్రొఫెసర్ ఓ అనంత రామయ్య హయాంలో విశ్వవిద్యాలయం కోసం ఎంతగానో వెదుకులాట చేశారు. తర్వాత శర్మా కూడా స్థలంకోసంవెదికారు. తర్వాత వచ్చిన రాజాసాబ్, సిద్దేగౌడ, ప్రస్తుత కులపతి వెంకటేశ్వర్లు ప్రయత్నంతో జ్ఞానసిరి నూతన క్యాంపస్ సిద్ధమవుతోంది.

యూనివర్సిటీ ప్రధాన ద్వారం


జాతీయ స్పీకర్ల పరిశీలనా కమిటీ సభ్యుడిగా యూటీ ఖాదర్



బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్లు, అధికారాలు, నిబంధనల పరిశీలన జాతీయ కమిటీ సభ్యుడిగా రాష్ట్ర స్పీకర్ యూటీ ఖాదర్ నియమింపబడ్డారు. దేశవ్యాప్తంగా నలుగురు శాసనసభ స్పీకర్లతో కూడిన కమిటీలో యూటీ ఖాదర్ పేరును ఖరారు చేస్తూ లోక్‌సభ స్పీకర్ ఓ బిర్లా ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్ర స్పీకర్ రాహుల్ నార్వేకర్ సమితి అధ్యక్షుడు కాగా ఒడిశా స్పీకర్ సురమపాది, నాగాలాండ్ స్పీకర్ షరింగైన్ లాంగ్ కుమర్‌తో పాటు యూటీ ఖాదర్‌లు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర శాసనసభలలో నిబంధనలు సంస్కరించడంతో పాటు పార్లమెంటరీ వ్యవహారాలను పరిశీలించేలా సమితి పర్యవేక్షించనుంది. క్రమశిక్షణ లేకుండా వ్యవహరించడంతో పాటు అన్‌పార్లమెంటరీగా మాట్లాడటంతోపాటు అనేకమైన మార్పులు తీసుకువచ్చేందుకు సమితి పనిచేయనుందని గురువారం బెంగళూరులో స్పీకర్ యూటీ ఖాదర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర శాసనసభలో ఇటీవల కలాపాల వేళ 18మంది బీజేపీ సభ్యులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయడం బాధపడే రోజుగా భావించానన్నారు. కానీ సభా మర్యాదల విషయంలో స్పీకర్‌గా కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు. జాతీయ స్థాయి స్పీకర్‌ల సమితి సభ్యుడిగా నియమింపబడిన స్పీకర్ యూటీ ఖాదర్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని గతంలో మంత్రిగాను కొనసాగారు.

రౌడీషీటర్‌పై పోలీసుల కాల్పులు

- తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా కాలిపై కాల్చిన సీఐ
- సిరుగుప్పలో కలకలం

సిరుగుప్ప, మే 15(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా నాయకుడు అమరేష్‌పై సీఐ హనుమంతప్ప గన్‌తో కాల్పులు జరిపిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. సిరుగుప్ప పట్టణానికి చెందిన అమరేష్ వివిధ కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. అమరేష్ కేసుపై సింధనూరు మార్గంలో అంకలిమఠం వద్ద పంచనామా, స్థల పరిశీలనకు ఇద్దరు పోలీసులు, సీఐ హనుమంతప్ప, అమరేష్‌లు వెళ్లారు. స్థలాన్ని పరిశీలిస్తున్నప్పుడు నిందితుడు అమరేష్, పోలీసులు విరూపాక్షిగౌడ, మారుతిలతో వాగ్వాదం చేస్తూ చేసి దాడికి పాల్పడ్డాడు. ఇద్దరిని గాయపరచి అమరేష్ తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ హనుమంతప్ప అమరేష్‌ను బెదిరిసైత్తు రెండు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపారు. అయినప్పటికీ అలాగే పరిగెడుతుండంతో అమరేష్ కాలికి సీఐ గన్‌తో కాల్చారు. అనంతరం పోలీసులను, బళ్లారి విమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. సంఘటనా స్థలానికి జిల్లా ఎస్పీ శోభారాణి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నిందితుడు అమరేష్ కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలో వరుసగా దోపిడీలు చేస్తూ తాలుకాలో పలు బైకుల చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.


విమ్స్‌లో అమరేష్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి


నిందితుడు అమరేష్

డీసీఎం డీకేకు సుప్రీంలో ఊరట

- అక్రమ ఆదాయాల కేసు జూలైకు వాయిదా



బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి డీసీఎం డీకే శివకుమార్ కేసును సుప్రీం కోర్టులో జూలైకు వాయిదా వేయడంతో కాస్త ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. బీజేపీ నుంచి వేటుపడిన ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్, సీబీఐ అధికారులు వేర్వేరుగా నమోదు చేసిన పిటిషన్‌లు ఒకేసారి విచారణ జరుపుతున్న ధర్మాసనం జూలైకు వాయిదా వేశారు. సీబీఐ తరుపున న్యాయవాదులు రాజకీయ పలుకుబడి ఉపయోగించారంటూ వాదించారు. డీకే శివకుమార్ తరుపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. 2013-18 మధ్య కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో రూ.74కోట్ల సంపాదించారనే విషయమై ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ పాలనలో సీబీఐ విచారణకు ఆదేశించారు. విచారణ దశలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా జోక్యం చేసుకుని డీకే శివకుమార్‌ను అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపగా బెయిల్‌పై విడుదలయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీబీఐ విచారణను వాపసు తీసుకున్నారు. దీంతో సీబీఐ నేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మరో వైపు సమగ్ర విచారణలు కోరుతూ ఎమ్మెల్యే యత్నాళ్ కూడా పిటీషన్ వేశారు. కేసును జూలై నెలకు వాయిదా వేసే ఆదేశాలు డీకే శివకుమార్ బర్త్‌డే రోజునే రావడంతో ఆయనతో పాటు అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగుల మృతి

హోసూరు క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో అటవీశాఖకు చెందిన ఫారెస్ట్ రేంజర్, గార్డ్ మృతి చెందారు. రేంజర్ కార్తికేయన్ (32), గార్డ్ దివాకర్ (24) మృతులుగా గుర్తించారు. తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి ప్రాంతంలో పనిచేస్తున్న వీరిద్దరూ బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై మాధుర్ వైపు వెళ్తుండగా, తిరువణ్ణామలై నుంచి వస్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొంది. కమలాపురం గ్రామం సమీపంలోని మురుగన్ ఆలయ సమీపాన ప్రమాదం చోటుచేసుకోగా ఘటనా స్థలంలోనే ఇద్దరూ మృతి చెందారు. మాధుర్ పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.


ప్రమాద స్థలంలో మృతదేహాలు



పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్


బంగారు పతకాలతో విద్యార్థినులు

సాగులోనూ ఏఐ పరిజ్ఞానం

- శాస్త్రవేత్తలు మెలకువలపై దృష్టి పెట్టాలి: వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్

నన్ను పెళ్లికి పిలవలేదు..

- బిగ్‌బాస్ ఫేం చైత్ర కుందాపురపై తండ్రి ఆగ్రహం
- 2 క్వార్టర్ల మందు ఇస్తే మా నాన్న పొగిడేవారు: చైత్ర


చైత్ర


బాలకృష్ణ నాయక్

వర్ష బీభత్సం..!



- నీట మునిగిన పలు కాలనీలు
- ఇళ్లలోకి చేరిన వర్షపునీరు
- నానా అవస్థలు పడ్డ జనం
- తడిసిపోయిన తిండి గింజలు
- కొట్టుకుపోయిన ఇళ్లలోని సామగ్రి

అనంతపురం, రాప్తాడు, కనగానపల్లి మండలాల్లో దంచికొట్టిన వాన

అనంతపురంరూరల్/రాప్తాడు/కనగానపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): వర్షం బీభత్సం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి. అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని పలు కాలనీలు నీటమునిగాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో బియ్యం బస్తాలు తదితర తిండిగింజలు తడిసిపోయాయి. కొంత సామగ్రి వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆయాప్రాంతాల ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి సమీపాన గల శిల్పాలేపాక్షి నగర్‌లోకి పెద్దఎత్తున నీరు చేరింది. క్రిష్ణంరెడ్డిపల్లి క్రాస్‌లోని సీపీఐ కాలనీలో సైతం ఇదే పరిస్థితి కినిపించింది. కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని బీజేపీ కొట్టాలలో పరిస్థితి మరింత దయనీయంగా కనిపించింది.

పోటెత్తిన వంకలు

బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. వంకలు పరవళ్లు తొక్కాయి. కందుకూరు గ్రామ సమీపంలో కోతుల వంక, ఉప్పరపల్లిలోని చప్పిడి వంక, పండమేరు వంక ఉధృతంగా ప్రవహించాయి. సాయంత్రంమైనా నీటి ప్రవాహం తగ్గలేదు. ఉప్పరపల్లి ప్రాంతవాసులు పూలకుంట, ఇటుకలపల్లి మీదుగా నగరానికి రావాల్సి వచ్చింది. రాప్తాడు పరిధిలో వర్షం మరింత ఎక్కువగా నమోదు కావడంతో కింది భాగంలో ఉన్న ఈ ప్రాంతాల్లోని వంకలు పొంగిపొర్లాయి. రైల్వే లోకో పైలెట్ విధుల నిమిత్తం ఆకుతోటపల్లి నుంచి కందుకూరు మీదుగా ధర్మవరానికి కారులో వెళ్తూ కోతుల వంకలో చిక్కుకున్నాడు. నీటి ప్రవాహం ఎక్కువ అవుతుండటంతో ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు లొకేషన్ షేర్ చేశాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. కందుకూరు గ్రామం నుంచి కూరగాయల మార్కెట్‌కు నగరానికి వెళ్తున్న వారికి విషయం చెప్పడంతో గ్రామం నుంచి సదరు ఆటో డ్రైవర్ మరి కొంతమందిని అక్కడికి తీసుకొచ్చి, లోకో పైలెట్‌ను బయటకు తీసుకొచ్చారు.

శిల్పాలేపాక్షి నగర్‌లోకి వరద నీరు..

జంగాలపల్లి, కందుకూరు, ఆకుతోటపల్లి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఆకుతోటపల్లి సమీపంలోని వంక ఉధృతంగా ప్రవహించింది. ఎగువ ప్రాంతాల్లోని వర్షపు నీరంతా ఆ వంకలోకి చేరడంతో దిగువన ఉన్న శిల్పాలేపాక్షినగర్ లోకి వరద నీరు పెద్దఎత్తున చేరింది. దీంతో కాలనీ జలమయమైంది. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి కనిపించింది. రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని, పరిశీలించారు. స్థానికంగా నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చివేయించారు. దీంతో సమస్య కొంత తగ్గింది. ఈక్రమంలోనే స్థానికులు.. ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబుకు సమస్యను వివరించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆకుతోటపల్లిలోని సెంట్రల్ స్కూల్ ప్రహరీ వర్షానికి కూలిపోయింది.

సీపీఐ కాలనీ జలమయం

క్రిష్ణంరెడ్డిపల్లి క్రాస్‌లో ఉన్న సీపీఐ కాలనీలోకి వర్షపునీరు పెద్దఎత్తున చేరింది. మోకాలి ఎత్తున నీరు ప్రవహించింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు. ధాన్యపు గింజలు, ఇళ్లలోని ఇతరత్రా సామగ్రి వర్షపు నీటిలో తడిసిపోయాయి. ఇళ్లలోని నీటిని బయటకు పంపేందుకు స్థానికులు అవస్థలు పడ్డారు. దాదాపు 30 ఇళ్లలోకి వర్షపు నీరు చేరినట్లు తెలుస్తోంది.

బీజేపీ కొట్టాలలో మరీ దారుణం

వర్షానికి మండలంలోని కక్కలపల్లి పంచాయతీ పరిధి బీజేపీ కొట్టాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. స్థానికంగా ఉన్న కాలువ వర్షపునీటితో పెద్దఎత్తున ప్రవహించింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. ఇళ్లలోని సామగ్రి తడిసిపోయింది. కాలువలో పూడిక పేరుకుపోవడం, రక్షణగోడ, కల్వర్టులు సరిగా లేకపోవడంతో ఇళ్లలోకి నీరు చేరింది. కాలువపై అక్రమ నిర్మాణాలు మరో కారణంగా స్థానికులు చెబుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువవడంతో కొట్టాల సమీపంలోని ఓ వెంచర్ వర్షపు నీటితో నిండిపోయింది. స్థానికులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. నీటి ప్రవాహానికి అడ్డుగా మరో వెంచర్ వ్యక్తి షెడ్డు కట్టడంతో ఈ దుస్థితి దాపురించింది. రెవెన్యూ అధికారులు ఆ షెడ్డును తొలగించడంతో కొంత సమస్య తీరినట్లయింది.

రాప్తాడులో..

మండలవ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో వంకలు, చెక్‌డ్యాంలు నిండాయి. రాప్తాడు పంచాయతీ పరిధిలోని సీపీఐ కాలనీ నీట మునిగింది. వర్షపునీరు ఎగువ ప్రాంతం నుంచి ఎక్కువగా రావడంతో సీపీఐ కాలనీ జలమయమైంది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. కాలనీలో 250 ఇళ్లు ఉండగా.. ప్రస్తుతం 150కిపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వర్షపునీరు కాలనీలోని ఇళ్లలోకి పెద్దఎత్తున చేరింది. ఇళ్లలోని నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. కాలనీ ప్రజలు వర్షపు నీటిలో చిక్కుకుపోయారు. గురువారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఇళ్లలోని ప్రజలు, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలను సురక్షితంగా బయటకు చేర్చారు. వర్షపునీరు సీపీఐ కాలనీలో నిల్వ ఉండకుండా బయటకు పంపే చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో నీరు వేగంగా దిగువ ప్రాంతానికి వెళ్లేలా చేశారు. కాలనీ వాసులందరూ సురక్షితంగా ఉండేలా సహాయక చర్యలు చేపట్టారు. రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాల్ ఉదయం సీపీఐ కాలనీ వాసులకు టిఫిన్ సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం జేసీ శివనారాయణశర్మ, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, రూరల్ డీఎస్పీ వెంకటేశులు, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సీపీఐ నాయకులు మల్లికార్జున, రామకృష్ణ.. కాలనీని పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా సహాయక చర్యలు చపట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు.

రామినేపల్లిలో..

రాప్తాడు మండలంలోని రామినేపల్లిలో దాదాపు 20 ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ద్విచక్రవాహనాలు నీటిలో మునిగిపోయాయి. తెల్లవారేవరకూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇళ్లలోని నిత్యావరస సరుకులు నీట మునిగాయి. భారీ వర్షానికి రామలింగప్ప, వెంకట్రాముడుకు చెందిన ఇంటి గోడలు కూలాయి. ఇంట్లో ఉన్నవారు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనార్టీ కాలనీలో కూడా కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దారులన్నీ జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పండమేరు పరవళ్లు

భారీ వర్షానికి పండమేరు వంక పరవళ్లు తొక్కింది. మండలవ్యాప్తంగా కుండపోత వర్షం కురవడంతో పండమేరు వంక ఉధృతంగా ప్రవహించింది. వంక ప్రాంతంలోని చెక్‌డ్యాంలు, నీటి కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల పిడుగులు

భారీ వర్షానికి రాప్తాడు గ్రామంలోని అగ్ర ఎర్రగుంటప్ప, రామలింగయ్య ఇంటిపై పిడుగులు పడ్డాయి. ఎర్రగుంటప్ప ఇంటి మీద ఉన్న డిష్ గంప మీద పిడుగు పడటంతో గోడకు రంధ్రం ఏర్పడింది. రామలింగయ్య ఇంటిపై పిడుగు పడటంలో గోడ నెర్రెలు చీలింది. ఇంటిలోని వైరింగ్ మొత్తం కాలిపోయింది. ఆ ఇళ్లలో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం లేదు.

నిండిన నీటికుంటలు

భారీ వర్షానికి కనగానపల్లి మండలంలో నీటికుంటలు నిండిపోయాయి. చెక్‌డ్యాంలలోకి నీరు చేరింది. ఖరీఫ్ ప్రారంభంలో ముందస్తుగా వర్షాలు కురవడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముక్తాపురం గ్రామ వీధుల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అనంతపురంరూరల్ మండలంలోని పలు నీటి కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఆకుతోటపల్లి, కక్కలపల్లి ప్రాంతాల్లోని నీటికుంటలు నిండి, పొంగిపొర్లాయి.



ప్రజాశక్తి నగర్‌లో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు



కందుకూరు సమీపంలోని కోతుల వంకలో కొట్టుకొచ్చిన కారు



ప్రజాశక్తి కాలనీలో ఇంట్లోకి నీరు చేరడంతో నానిన వస్తువులను బయట ఆరబెడుతున్న దృశ్యం



ప్రజాశక్తి కాలనీలోని ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు



ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని బయటకు తోడిపోస్తున్న మహిళ



శిల్పా లేపాక్షి నగర్‌లో ఇళ్ల మధ్యలో నిలిచిన వరద నీరు



క్రిష్ణంరెడ్డిపల్లిలో ఇంటి చుట్టు చేరిన నీరు



ఆకుతోటపల్లిలో పడిపోయిన సెంట్రల్ స్కూల్ గోడ



ఉప్పరపల్లి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చప్పిడి వంక

ఎక్కడెక్కడ.. ఎంతెంత వానంటే..

అనంతపురం అర్బన్/పుట్టపర్తిరూరల్: ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం పడింది. అత్యధికంగా రాప్తాడులో 141.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కనగానపల్లి 75.2, ధర్మవరం 71.6, కళ్యాణదుర్గం 53.2, బుక్కపట్నం 46.0, తాడిమర్రి 41.2, ఆత్మకూరు 38.0, బత్తలపల్లి 36.2, బ్రహ్మసముద్రం 35.0, బుక్కరాయసముద్రం 34.2, పుట్టపర్తి 33.2, చిలమత్తూరు 33.2 మిమీ, కొత్తచెరువు, శెట్టూరు 27.6, పామిడి 26.4, నార్పల 25.6, అనంతపురం 24.6, గాండ్లపెంట 24.4, కదిరి 21.2, అమడగూరు 20.8, ఓబుళదేవరచెరువు 16.4, చెన్నేకొత్తపల్లి 16.2, ముదిగుబ్బ 12.6, రాయదుర్గం 12.4, కంబదూరు 12.2, రామగిరి 11.8, గుమ్మఘట్ట 10.2, యాడికి 10.0, పెద్దవడుగూరు 9.6, తలుపుల 9.4, డి.హిరేహాళ్ 8.6, కూడేరు 8.0, నల్లచెరువు 7.2, శింగనమల 5.8, తాడిపత్రి, గోరంట్ల 5.4, తనకల్లు, గార్లదిన్నె 4.8, బెలుగుప్ప, యల్లనూరు 4.6, నల్లమాడ 4.2, సోమందేపల్లి 3.8, పెద్దపప్పూరు 3.6, గుంతకల్లు 3.4, పెనుకొండ 2.8, గుత్తి, కుందుర్పి 2.6, నంబులపూలకుంట 2.4, రొద్దం 2.0, వజ్రకరూరులో 1.2 మి.మీ. వర్షం కురిసిందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

కార్యకర్తలే టీడీపీ బలం

మీ సేవలను ఎన్నటికీ మరువం

- గ్రూపు రాజకీయాలు, అలకపాన్పులు వద్దు
- కష్టపడ్డ అందరికీ న్యాయం చేస్తాం
- నీరు-చెట్టు పెండింగు బిల్లులు ఇచ్చేస్తాం
- కేసులపై ప్రత్యేక సెల్‌కు ఫిర్యాదు చేయండి
- విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్
- గుంతకల్లు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం





ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్, హాజరైన కార్యకర్తలు

గుంతకల్లు/గుత్తి, మే 15(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల బలంపైనే టీడీపీ నిలిచి ఉందని, ఏ కార్యకర్తనూ మరచిపోమని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుత్తి పట్టణ శివారులో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం హెలీక్యాప్టర్‌లో గుత్తికి వచ్చిన ఆయన, తొలుత ఉత్తమ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అత్యుత్తమ చొరవ, నిబద్ధత చూపిన 32 మంది కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, గౌరవ పురస్కారాలను అందజేశారు. కార్యకర్తల పోరాటం ఫలితంగానే వైసీపీ దుష్టపరిపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడగలిగామని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు కష్టాలను చవిచూస్తే, టీడీపీ శ్రేణులు నరకాన్ని అనుభవించారని అన్నారు. కష్టపడి సాధించిన ఈ విజయాన్ని పదిలపరుచుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. రానున్న రోజుల్లో సమష్టిగా ముందుకెళ్లాలని, గ్రూపు రాజకీయాల జోలికి వెళ్లరాదని, అలిగి ఇంటివద్ద కోర్చోవద్దని కార్యకర్తలకు హితవు పలికారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో దారిలో మాట్లాడానని, కార్యకర్తల్లో ఎవరికీ అన్యాయం జరగదని, ఆయన అందరికీ న్యాయం చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వద్దకు ఎటువంటి అరమరికలూ లేకుండా వెళ్లి పనులు చేయించుకోవాలని సూచించారు.

నెలలో 3 రోజులు పనిచేయండి..

పింఛన్ల పంపిణీ తదితర సంక్షేమ పథకాల అమలుపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నెలలో మూడు రోజులు ఇందుకు కేటాయించి పనిచేయాలని లోకేశ్ సూచించారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అందేలా చేస్తే విజయం మనదే అవుతుందని అన్నారు. పెండింగులో ఉన్న నీరు-చెట్టు బిల్లులను పొందాలని, వైసీపీ హయాంలో అక్రమంగా బనాయించిన కేసులపై వీలైతే స్థానికంగా పరిష్కరించుకోవాలని, లేదంటే విజయవాడలో ఏర్పాటు చేసిన కేసుల ప్రత్యేక విభాగంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సోలార్ ప్రాజెక్టులో స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.

11 నెలల్లో చేసి చూపించాం

'యువగళం పాదయాత్ర చేసినప్పుడు కార్యకర్తల అభీష్టం మేరకు కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకే మీ ముందుకు వస్తున్నా' అని లోకేశ్ కార్యకర్తలకు స్పష్టం చేశారు. కార్యకర్తల పనితీరును టెక్నాలజీకి అనుబంధానం చేస్తే ఎవరు పనిచేస్తున్నారో తెలుస్తుందని ఆనాడే చెప్పానని అన్నారు. ఎవరు పనిచేస్తున్నారో స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చే ముందు క్లస్టర్, గ్రామ, మండల నాయకులను కలుస్తానని చెప్పానని, అందుకే మెగా సోలార్ పార్క్ శంకుస్థాపనకు వచ్చే ముందే ఇక్కడికి వచ్చానని అన్నారు. ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం చేయలేనిది.. 11 నెలల్లో చేసి చూపించామని అన్నారు. 'కరెంటు చార్జీలు పెంచమని చెప్పాం. జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున కంపెనీలు వచ్చాయి. అనంతపురానికి రూ.22వేల కోట్ల విలువైన భారీ సోలార్, విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తోంది. రాబోవు ఐదేళ్లల్లో యువతకు ఉద్యోగాలు వస్తాయి' అని అన్నారు. పార్టీ కార్యకర్తలంతా ప్రభుత్వ పరంగా చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అందరి కష్టంతో చరిత్రను తిరగరాశామని అన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్నడూ లేని విధంగా ప్రజలు కూటమికి 94 శాతం సీట్లు ఇచ్చారని అన్నారు. సునామీ మాదిరిగా ప్రజలు ఇచ్చిన తీర్పుతో చరిత్ర తిరగరాశామని, దీని వెనుక కార్యకర్తల కష్టం.. త్యాగాలు ఉన్నాయని అన్నారు. నాలుగున్నర దశాబ్దాల్లో అధికారం, ప్రతిపక్షం రెండు చూశామని అన్నారు. వైసీపీ అరాచక పాలన వంటిది ఇదివరకు ఎన్నడూ చూడలేదని అన్నారు. గతంలో చంద్రబాబు పరామర్శకు వెళితే ఆపే సాహసం ఎవరూ చేయలేదని అన్నారు. 2019 నుంచి 2024 వరకు భయానక పరిస్థితులు కల్పించారని అన్నారు. చంద్రబాబు బయటకు రావాలంటే ఇంటి గేటుకు తాళ్లు కట్టేశారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే బీ ఫాంలను పట్టుకెళ్లారని, ఇళ్లు ధ్వంసం చేశారని అన్నారు. 'పుంగనూరులో అంజిరెడ్డి తాత మీసాలు మెలేసి, తొడ గొట్టి నామినేషన్ వేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. పల్నాడులో మంజులారెడ్డి అనే తెలుగు మహిళ బూత్ ఏజెంట్‌గా ఉన్నందుకు కత్తులతో దాడి చేశారు. అయినా పోలింగ్ అయిపోయి, ఓటింగ్ మిషన్‌కు సీల్ వేసే వరకు అక్కడే ఉన్నారు. పల్నాడులో చంద్రయ్య మెడపై కత్తిపెట్టి జై జగన్ అనమంటే.. జై చంద్రబాబు అన్నందుకు మెడకోసి హత్య చేశారు. ఐదేళ్ల రాక్షస పాలనలో అనేక కష్టాలు ఎదుర్కొన్న విషయాన్ని నేను ఎప్పటికీ మరిచిపోను' అని లోకేశ్ ఉద్వేగంగా అన్నారు.

రెడ్ బుక్ మరువను..

'పార్టీ కేడర్ ఎర్రబుక్కు గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదలను. రెడ్ బుక్‌ను మరువను. నా అంతకు నేనుగా ఎవరితో గొడవ పెట్టుకోను. మన జోలికి వస్తే మాత్రం వదలను' అని లోకేశ్ అన్నారు. గత ప్రభుత్వంలో మద్యంలో ఎంత కుంభకోణం జరిగిందో రాష్ట్రం అంతా చూస్తున్నారని అన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిందేనని, ఈ క్రమంలో కొంచెం సమయం పట్టొచ్చునని అన్నారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి, వారి మధ్యనే గడపాలని సూచించారు. పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని, కార్యకర్తల బాగు కోసమే తాను పనిచేస్తున్నానని అన్నారు. పార్టీలోనూ అదే నినాదాన్ని వినిపిస్తున్నానని అన్నారు. ఇది మన కుటుంబం.. మన పార్టీ, అన్యాయం జరిగితే తనను, పార్టీలోని ఇతర పెద్దలను కలవాలని సూచించారు. ఇన్‌చార్జి మంత్రి నెలకు ఒక సారి రావాలని ఇప్పటికే చెప్పానని అన్నారు. జోనల్ కో ఆర్డినేటర్, పార్లమెంట్ అధ్యక్షుడు అందుబాటులో ఉంటారని అన్నారు. 'సమస్యలపై నాలుగు గోడల మధ్య యుద్ధం చేద్దాంగాని.. బయటకు వస్తే మాత్రం జై తెలుగుదేశం అని నినదిద్దాం' అని కార్యకర్తల్లో భరోసానింపారు. త్వరలో మై టీడీపీ పేరుతో కొత్త యాప్‌ను తీసుకొస్తున్నామని, మహానాడు తర్వాత విడుదల చేస్తామని అన్నారు. అన్ని స్థాయిల్లోనూ అందరికీ ఒకే యాప్ ద్వారా కార్యక్రమాలపై సందేశాలు పంపిస్తామని అన్నారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులను జరుపుకోవాలని సూచించారు. ఈనెల 27, 28, 29వతేదీల్లో కడపలో మన పెద్దపండుగ మహానాడు జరుగుతుందని, ఆ పండుగలో కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.





మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పయ్యావుల




దివ్యాంగుడి సమస్యలు ఆలకిస్తూ...

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

బాబ్ హాక్ (వర్ధంతి)



దక్షిణ ఆస్ట్రేలియాకు చెందిన రాజకీయనేత. లేబర్ పార్టీ నాయకుడు రాబర్ట్ జేమ్స్ లీ హాక్ 1929 డిసెంబరు 9న జన్మించారు. 1983 నుంచి 1991 వరకు 23వ ప్రధాన మంత్రిగా వ్యవహరించారు. 1984లో ఒపీనియన్ పోల్‌లో 75శాతంతో అత్యధిక ప్రజాదరణ పొందిన నాయకుడిగా నిలిచారు. లేబర్ పార్టీ అధికారంలో వచ్చేందుకు ఎంతో కృషి చేశారు. వ్యాపారరంగంలో రాణించినట్టుగానే సేవా కార్యక్రమాల్లోనూ ముందంజలో ఉండేవారు. ఆస్ట్రేలియాలో థర్డ్ లాంగెస్ట్ సర్వింగ్ ప్రైమ్ మినిస్టర్‌గా నిలిచారు. 2019 మే 16న కన్నుమూశారు.

సబటిని (పుట్టినరోజు)



అర్జెంటీనా దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారిణి గేబ్రియెలా బీట్రిజ్ సబటిని 1970 మే 16న జన్మించారు. 1980-1990 మధ్య వర్ధమాన క్రీడాకారిణిగా రాణించారు. 41 టైటిల్స్‌ను సొంతంచేసుకున్నారు. సింగిల్స్‌లోనూ, డబుల్స్‌లోనూ 3వ ర్యాంకులో కొనసాగారు. 1990 యూఎస్ ఓపెన్, 1988లో స్టెఫీగ్రాఫ్‌తో కలసి వింబుల్డన్ ట్రోఫీ కైవశం చేసుకున్నారు. 2006లో ఇంటర్నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు. 2017లో జీన్ బరోత్రా స్పోర్ట్స్‌మన్‌షిప్ అవార్డ్, 2018లో అథ్లెట్ రోల్‌మోడల్, 2019లో ఫిలిప్ చార్టిర్ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం యూనిసెఫ్, యునెస్కోలతో కలసి సమాజసేవ అందిస్తున్నారు.

క్యాన్సర్ సొసైటీ ద్వారా చైతన్యం

బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక క్యాన్సర్ సొసైటీ ద్వారా పొగాకు ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యంపై జరిగే పరిణామాల పట్ల సమాజంలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పోటీలు జరుపుతున్నారు. నగర పరిధిలోని 40 కళాశాలలో ఈనెల 20 నుంచి వారం రోజుల పాటు పోటీలు జరుగుతాయని మెడికల్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీఏ కిశోర్ తెలిపారు. క్విజ్, షార్ట్‌ఫిల్మ్, రంగోలి ఇన్‌స్టా రీల్స్ వంటి పలు విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. 27వ తేదీతో పోటీలు ముగించి ప్రతిభావంతులను ఎంపిక చేస్తామన్నారు. శేషాద్రిపురం కళాశాలలో 31న బహుమతుల ప్రధానోత్సవంతోపాటు కిద్వాయ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పద్మశ్రీ విజయలక్ష్మి దేశ్‌మానెకు ప్రత్యేక సత్కారం ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా గౌరవ ప్రధానకార్యదర్శి వుడే పి కృష్ణ, అగ్నిమాపక, అత్యవసర విభాగం డీజీ రవి చెన్నణ్ణనవర్, కిద్వాయ్ ఆసుపత్రి డైరెక్టర్ టి నవీన్‌తో పాటు పలువురు ముఖ్యులు పాల్గొంటారన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి



నగరంలో ఆందోళన చేస్తున్న రైతులు

రాయచూరు, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం రైతు సంఘం, హసిరుసేన ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక బసవేశ్వర సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జెస్కాం కార్యాలయం వరకు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగానే రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు అక్రమ సక్రమ పేరుతో ఉచితంగానే ఇవ్వాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో రైతులు తమ పొలంలో రెండు అంతకంటే ఎక్కువ బోర్లు కూడా వేస్తున్నందున బోర్ల అనుమతికి ఆధార్‌ను లింక్ చేయడం సరికాదన్నారు. కాగా రైతుల పంప్‌సెట్‌ల కోసం స్మార్ట్ కార్డులు, డిజిటల్ మీటర్‌ల ఏర్పాటు కోసం రూ.10వేలు ఫీజు వసూలు చేస్తున్నారని దాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జెస్కాం కార్యాలయంలో అధికారికి వినతి పత్రం ఇచ్చారు.

విపత్తు నిర్వహణపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిక్కబళ్ళాపుర, మే 15 (ఆంధ్రజ్యోతి): విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. నగరంలోని బస్టాండ్ వద్ద గురువారం అత్యవసర పరిస్థితులపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు. అగ్ని ప్రమాదం సహా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు, ఆస్తుల రక్షణ కల్పించడానికి కేంద్రప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, విపత్తు నిర్వహణ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మంటలను ఆర్పడం, గాయపడినవారిని రక్షించడం, రోగులను అంబులెన్స్‌కు తరలింపు వంటివాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాగ్‌స్క్వాడ్ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాధికారి రవీంద్ర, జడ్పీ సీఈఓ ప్రకాశ్, ఎస్పీ కుశల్ చౌక్సి, కేఎస్‌ఆర్టీసీ డివిజనల్ కంట్రోలర్ బసవ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాయలచెరువు విద్యార్థి ప్రతిభ

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన టోపీఖాన్, షఫియాబేగం దంపతుల కుమారుడు రఫీక్‌ఖాన్ మైనింగ్ ఇంజనీరింగ్‌లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు తో సత్తాచాటాడు. పులివెందులలోని లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చేశాడు. ఇంజనీరింగ్ ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈ-సెట్‌లో రఫీక్‌ఖాన్ ప్రతిభ కనబరిచాడు. 96 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు కైవసం చేసుకున్నాడు.

సాగులోనూ ఏఐ పరిజ్ఞానం

బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): సాగులోనూ 'ఏఐ' టచ్ అవసరమని తద్వారా అన్నదాతకు అండగా ఉండాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అభిప్రాయపడ్డారునగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం 60ఏళ్ల సుదీర్ఘసేవను పూర్తి చేసుకుని వజ్ర మహోత్సవాన్ని ఆచరిస్తుండడం సంతోషంగా ఉందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ హర్షం వ్యక్తం చేశారు. జీకేవీకే ఆవరణలోని డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ సభాభవనంలో గురువారం ఉదయం ఏర్పాటైన 59వ స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్యులుగా విచ్చేశారు. వ్యవసాయశాఖ మంత్రి, వర్సిటీ సహకులాధిపతి చలువరాయస్వామి, ఇఫ్కో సంస్థ ఎండీ డాక్టర్ యూఎస్ అవస్థి తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ ప్రసంగిస్తూ ఆరు దశాబ్దాలలో 332 కొత్త వంగడాలు, 500కుపైగా వ్యవసాయ ఉపకరణాల సాంకేతిక ఆవిష్కరణలతో యూనివర్సిటీ ఒక గొప్ప మైలురాయి సాధించి అన్నదాతలకు, వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనకరం సాధ్యమైందన్నారు. స్నాతకోత్సవం అనేది సందర్భానుసారంగా చేసుకునే వేడుక అని, పట్టాలు అందుకున్న విద్యార్థుల జీవితంలో ఒక గొప్ప అనుభూతి నిలుస్తుందన్నారు. పట్టాలు పొందిన విద్యార్థులు, సమాజానికి, వ్యవసాయరంగానికి తమవంతు సేవ అందించాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుతం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీ ట్రెండింగ్‌గా ఉందని ఈ సాంకేతికతను వ్యవసాయ ఆవిష్కరణలకు ఏ విధంగా దోహదపడతాయో అందుకు పట్టభద్రులు కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నూతన ఆవిష్కరణలు సంప్రదాయ సాగు విధానాలను మెరుగు చేసేలా ఉండాలని, అదే విధంగా పర్యావరణానికి భంగం కలగని రీతిలో ఉండాలన్నారు. పంటల దిగుబడికి జీనోమ్ టెక్నాలజీ ఉపయోగపడాలన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికి 59వ స్నాతకోత్సవంలో మొత్తం 1271మందికి పట్టాలు ప్రదానం చేశారు. 871మందికి డిగ్రీ,



గౌరవ డాక్టరేట్ల ప్రదానం

3711మందికి పీజీ, 89మందికి డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ)లో మొత్తం 30 బంగారు పతకాలు ప్రదానం చేశారు. వీరిలో 13మంది విద్యార్థినులు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. పీజీలో 62మంది బంగారు పతకాలను ప్రదానం చేశారు. వీరిలో 23మంది విద్యార్థినులు, 5మంది విద్యార్థులు ఉన్నారు. ఇక డిగ్రీలో 58 బంగారు పతకాలు ప్రదానం చేయగా వీరిలో 13మంది విద్యార్థినులు, ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. 59వ స్నాతకోత్సవంలో మొత్తం 150 బంగారు పతకాలు, పురస్కారాల ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. వీటిలో విశ్వవిద్యాలయం నుంచి, దాతల పతకాలు ఉన్నాయి. ఇక రిటైర్డు ఐఏఎస్ వీ బాలసుబ్రమణియన్, యోగేంద్రకుమార్‌లకు గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. బంగారు పతక విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.

పెరుగుతున్న పిడుగుపాటు మరణాలు

- రాష్ట్రంలో 5 సంవత్సరాల్లో 454 మంది బలి

బళ్లారి సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో పిడుగు పాటుకు బలవుతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గత 5 సంవత్సరాల్లో రాష్ట్రంలో పిడుగుపాటుకు 454 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ లెక్కల మేరకు 2022లో అత్యధిక మరణాల సంఖ్య 113గా నమోదయ్యింది. మృతుల్లో ఎక్కువ మంది పశువుల కాపరులు, రైతులు, కూలీలు, గొర్రెల కాపర్లే ఉండడం బాధాకరం. రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసిన నేపథ్యంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పిడుగుపాటుకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. దానిని పాటించాలని అభ్యర్థించింది.

పరిష్కారం ఏంటి?

● పిడుగు పాటుకు గురైన వారి కుటుంబాలకు ప్రభుత్వం 48గంటల్లోపు రూ.5లక్షల పరిహారం అందిస్తుంది. పిడుగుపాటుకు గురైనవారి పోస్ట్ మార్టం నివేదికలు, మృతుల స్థానం, రెవెన్యూ శాఖలోని కిందిస్థాయి అధికారుల నివేదికల ఆధారంగా జిల్లా సబ్ డివిజనల్ అధికారి తక్షణ సహాయాన్ని ఆదేశిస్తారని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ జిల్లాస్థాయి అధికారులు తెలిపారు.



● ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు ఎత్తైన మైదానాలు, ఎత్తు ప్రాంతాలు కాకుండా లోతట్టు ప్రాంతాలకు వెళ్లాలి. బహిరంగ ప్రదేశంలో ఉంటే మీ తలను మీ మోకాళ్ల మధ్య ఉంచుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ చెట్ల కింద నిలబడరాదు. వర్షాకాలంలో సరస్సులు, చెరువుల్లో ఈత కొట్టరాదు. విద్యుత్ స్తంభాలు లేదా టవర్ల దగ్గర నిలబడరాదు.

ఆపరేషన్ సిందూర్ టాటూ ట్రెండ్..!



చేతిపై ఆపరేషన్ సిందూర్ పేరుతో టాటూ

బళ్లారి గాంధీనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర ద్వారా ప్రపంచం మొత్తం భారత్ వైపు తిరిగి చూసేలా చేసిన సైనికులపై అభిమానం వెల్లువెత్తుతోంది. మన సైన్యం పరాక్రమానికి దేశ ప్రజలు పలు రకాలుగా అభిమానాన్ని చాటుకుంటున్నారు. విజయనగ జిల్లా కేంద్రమైన హొసపేట పట్టణంలో చేతులపై ఆపరేషన్ సింధూర్ అని టాటూలు వేయించుకుని దేశభక్తిని చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ట్రెండ్ ఎక్కువగా కనిపిస్తోంది. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్గవాదుల దాడుకు ప్రతీకార చర్యగా భారత్ సైన్యం పాక్‌పై ఆపరేషన్ సింధూర పేరుతో పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సాహసాన్ని స్మరించుకునే దిశలో యువత చేతులపై జాతీయ పతాకం, భారతదేశ చిత్రపటం, వాయుసేన యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకర తదితర టాటూలను తమ ఎదపై, చేతులపై వేయించుకుంటూ దేశభక్తిని ప్రదర్శిస్తున్నారు.

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్

అనంతపురం క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): తాను ఐఏఎస్ అధికారినని చెప్పి సీఐ మురళీకృష్ణను బెదిరించిన కేసులో బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ మంజూరైంది. 2018లో అనంతపురం త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించిన కేసు విచారణ నిమిత్తం గురువారం జిల్లా జైలు నుంచి బోరుగడ్డ అనిల్‌ను కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (మొబైల్ కోర్టు) ఇన్‌చార్జి న్యాయాధికారి హారిక రాఘూరి బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో పోలీసులు సరైన సాక్ష్యాధారాలు చార్జ్‌షీట్‌లో పొందుపరచలేకపోయారనీ, కేసు కొట్టివేయాలని అనిల్ తరపు న్యాయవాది నారాయణరెడ్డి డిశ్చార్జి పిటీషన్ దాఖలు చేశారు. కేసు విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేశారు. ఇదివరకే ఫోర్త్‌టౌన్ కేసులోనూ బెయిల్ రావడంతో అనంతపురంలో నమోదైన రెండు కేసుల్లోనూ బోరుగడ్డకు బెయిల్ లభించినట్లయింది.

నాటిన ప్రతి మొక్కను రక్షించాలి

- సీఎఫ్, డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్ మే 15 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో రిజర్వ్ ఫారెస్ట్‌లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సీఎఫ్ యశోదాబాయి, డీఎఫ్ఓ విఘ్నేష్ తమ సిబ్బందిని ఆదేశించారు. శెట్టూరు మండలంలో రైతు ఎల్‌కే నాయుడు పెంచుకొన్న ఎర్రచందనం చెట్ల కోతకు అనుమతి కోరుతూ అర్జీ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సీఎఫ్, డీఎఫ్ఓ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అనంతరం శెట్టూరు మండలంలో 84 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో పెంచుతున్న చెట్లను పరిశీలించారు. వాటి సంరక్షణకు స్థానిక సిబ్బందికి సూచనలు చేశారు. మరో ప్రాంతంలో 20 హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న చెట్లను పరిశీలించారు. అనంతరం గుండ్లపల్లిలో నర్సరీని తనిఖీ చేశారు. అలాగే కళ్యాణదుర్గంలో రూపుదిద్దుకుంటున్న నగరవనాన్ని పరిశీలించారు. అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకోవడంతో ప్రారంభానికి తగిన విధంగా చర్యలు చేపట్టేలా చూడాలని అటవీక్షేత్రాధికారి మధుబాబును ఆదేశించారు.

ఏపీఈసెట్‌లో 91శాతం ఉత్తీర్ణత

ఫలితాలను విడుదల చేసిన జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 15(ఆంధ్రజ్యోతి): బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించిన ఏపీఈసెట్-2025 పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 91.85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ, తెలంగాణలో ఏపీఈసెట్-2025ను జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ ఛైర్మన్‌గా వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, కన్వీనర్‌గా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ వ్యవహరించారు. ఉమ్మడి జిల్లాలో 2,650 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 2,434 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 91.85గా నమోదైంది. 14 బ్రాంచ్ (కోర్సు)లకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. తొలిసారిగా వాట్సాప్ ద్వారా విద్యార్థులకు ఫలితాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వీసీ తెలిపారు. 9552300009 నంబర్‌కు హాయ్ అని మేస్సేజ్ పెట్టి విద్యార్థులు ఫలితాలనుపొందవచ్చన్నారు. https://cets.apsche.ap.gov.in/ECET/ECET/ECET వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, కన్వీనర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో దక్కని చోటు...

ఈసెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు రాష్ట్రస్థాయి ర్యాంకులు దక్కలేదు. మైనింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్ విద్యార్థి పఠాన్ రఫీక్ ఖాన్ ఒక్కడే ఆ బ్రాంచ్‌లో రాష్ట్రస్థాయి తృతీయ ర్యాంకు సాధించాడు. మిగిలిన 13 బ్రాంచ్‌ల్లో టాప్ పది ర్యాంకుల్లో జిల్లాకు చోటు దక్కలేదు. 91.85శాతం మంది ఉత్తీర్ణత సాధించినా మెరుగైన ర్యాంకులు సాధించకపోవడం గమనార్హం.

పోయిన డబ్బుకు బ్యాంకుదే బాధ్యత

● వినియోగదారుల కమిషన్ తీర్పు

అనంతపురం క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేకుండానే ఖాతాదారుడు నష్టపోతే ఆ మొత్తాన్ని బ్యాంకే చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత తీర్పు ఇచ్చారు. అనంతపురానికి చెందిన అంబేడ్కర్ గురుకుల కళాశాల టీచర్ సునీతకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనంతపురంలో ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి 2023 మే నెలలో ఆధార్ గుర్తింపు ఆధారిత పేమెంట్ వ్యవస్థ(ఏడీపీఎస్) ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు ఐదు విడతలుగా రూ.40,200లు డ్రా చేశారు. ఈ విషయంపై ఆమె అదే ఏడాది మే 24న బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. 15రోజుల్లో బ్యాంకు వారు డబ్బు తిరిగి జమ చేస్తామని చెప్పి స్పందించలేదు. దీంతో ఆమె వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. నోటీస్ అందుకున్న బ్యాంకు అధికారులు ఏడీపీఎస్ లావాదేవీలు ఖాతాదారుల ఆధార్ ఆధారంగా వేలిముద్ర గుర్తింపు ఉపయోగించి జరిగిన వాటికి బ్యాంకు బాధ్యత వహించదని తెలిపారు. ప్రతి లావాదేవీకి మొబైల్‌కు మెసేజ్ కూడా పంపబడిందన్నారు. అయితే కమిషన్ పరిశీలనలో ఈ అంశం నిరూపణ కాలేదు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యుడు గోపీనాథ్‌లతో కూడిన ధర్మాసనం ఆర్‌బీఐ 06.07.2017సర్క్యులర్ ప్రకారం ఖాతాదారులకు సమాచారం ఇవ్వకుండా జరిగిన లావాదేవీలకు బ్యాంక్ బాధ్యత వహించాల్సి ఉంటుందని తీర్పు వెలువరించారు. బ్యాంకు రూ.40,200లను ఆరు శాతం వడ్డీతో 2023 మే 23 నుంచి చెల్లించాలని, మానసిక ఒత్తిడి, సేవల లోపానికి రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలని, కరెస్పాండెన్స్, ప్రయాణ ఖర్చులకు రూ.5వేలు చెల్లించాలని ఆదేశించారు. ఈ మొత్తాన్ని 45 రోజుల్లో ఫిర్యాదుదారురాలికి చెల్లించాల్సిందిగా కమిషన్ ఆదేశించింది.

నిధులు కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యం

ఆర్థిక సంఘం సమావేశంలో పురం మున్సిపల్ ఛైర్మన్

హిందూపురం, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కోరారు. గురువారం తిరుపతిలో 16వ ఆర్థిక సంఘం సమావేశం జరిగింది. దీనికి రాయలసీమ నుంచి మునిసిపల్ ఛైర్మన్ హాజరయ్యారు. సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ప్రతిపాదనలు తెలిపారు. 15వ ఆర్థిక సంఘంలో మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులు టైడ్, నాన్‌టైడ్ గ్రాంట్‌లు విధించారని నాన్‌టైడ్ గ్రాంట్‌లో మున్సిపాలిటీల అభివృద్ధి కోసం రోడ్లు, కాలువల నిర్మాణం చేయిస్తే మునిసిపాలిటీలు ఇప్పటికే



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్

బకాయిలుపడ్డ, విద్యుత్ చార్జీలు, ఇతరత్ర అప్పులకు జమ అవుతున్నాయన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులైనా ఎలాంటి షరతులు లేకుండా కేవలం అభివృద్ధి పనులకే వాడుకునేలా మార్పు చేయాలన్నారు. అనేక మున్సిపాలిటీలకు విద్యుత్ చార్జీలు పెనుభారంగా మారుతున్నాయని, వచ్చే ఆదాయంలో ఎక్కువ శాతం విద్యుత్ చార్జీలకే సరిపోతోందని వివరించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల బకాయిలు ఒకే విధానం చెల్లించి స్థానిక సంస్థలకు ఊరట కలిగించాలన్నారు. జనాభాకు అనుగుణంగా పట్టణాల్లో విస్తరణకు అనుగుణంగా ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలన్నారు. దీనివల్ల కొత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చే స్టాంప్‌డ్యూటీలు, సర్‌చార్జీలు నేరుగా స్థానిక సంస్థల ఖాతాలోకి జమచేసేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రభుత్వానికి చెల్లించే 18 శాతం జీఎస్‌టీని మినహాయించాలన్నారు. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా జరిగే రోడ్డు విస్తరణలో ఆర్థిక సంఘం నుంచి అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు.

2.5 లక్షల మంది బాలికలకు

స్కాలర్‌షిప్‌లు

● అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు: సీఈఓ అనురాగ్ బెహర్



బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా ప్రస్తుత విద్యాసంవత్సరంలో 2.50 లక్షల మంది బాలికల ఉన్నతాభ్యాసం కోసం స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు సీఈఓ అనురాగ్ బెహర్ వెల్లడించారు. గురువారం బెంగళూరులో అనురాగ్ బెహర్ మీడియాతో మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరంలో 25వేల మంది బాలికలకు ప్రోత్సాహకాలు అందించామన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం 2025-26లో ఏకంగా రెండున్నర లక్షల మందికి అందించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదివిన బాలికలు అర్హులన్నారు. డిప్లొమో లేదా డిగ్రీ చదివే విద్యార్థినులందరూ అర్హులన్నారు. ఒకసారి ఎంపిక చేస్తే సంబంధిత కోర్సు ముగిసేదాకా ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఎంపికైన విద్యార్థికి ఏడాదికి రూ.30వేలు ఇస్తామని ఉదాహరణకు నాలుగేళ్ళ నర్సింగ్ కోర్సు చేస్తూ ఉంటే ఏటా 30వేలు చొప్పున రూ.1.20లక్షలు ఇస్తామన్నారు. గత ఏడాది పైలెట్ ప్రాజెక్టుగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలోని కొన్ని జిల్లాలలో అమలు చేశామన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 18 రాష్ట్రాలను ఎంపిక చేశామన్నారు. అందులో కర్ణాటక, తెలంగాణ, అస్సాం, బీహార్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపుర, మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్, ఒడిశ్శా, రాజస్థాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరప్రదేశ్‌లు ఉన్నాయన్నారు. ఎటువంటి మార్పులైనా దరఖాస్తుకు ముందే వివరిస్తామన్నారు. భవిష్యత్‌లో దేశమంతటా అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడమే లక్ష్యమన్నారు.

నన్నే పెళ్లికి పిలవలేదు..!

బెంగళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : తరచూ వివాదాలలలో ఉండే బిగ్‌బాస్ ఫేం చైత్రా కుందాపుర మిత్రుడు శ్రీకాంత్ కశ్యప్‌ను ఇటీవలే పెళ్ళి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే చైత్ర తండ్రి బాలక్రిష్ణనాయక్ గురువారం కుందాపురలో సంచలనమైన ఆరోపణలు చేశారు. చైత్ర పెళ్ళికి తనను పిలువలేదని తండ్రి ఆరోపించారు. చైత్రతో పాటు పెళ్ళి చేసుకున్న శ్రీకాంత్‌లు మోసగాళ్ళు అన్నారు. ఎమ్మెల్యే టికెట్‌లు ఇప్పిస్తామంటూ గోవిందబాబు పూజారిని మోసం చేశారన్నారు. ఇలా సంపాదించిన సొమ్మును కొందరు యువకుల పేరిట డిపాజిట్ చేసి వాటిపై చైత్ర లోన్ తీసుకున్నారన్నారు. సైనికులకు సాయం చేశానంటూ ప్రచారం చేసుకోవడం అంతా అబద్ధమంటూ కొట్టిపారేశారు. ఇదే విషయమై చైత్ర కుందాపుర స్పందిస్తూ రెండు క్వార్టర్‌ల మద్యం ఇప్పిస్తే తనను దేవత అంటూ తండ్రి కొనియాడేవారన్నారు. తన పెళ్లికి అంగీకరించనందుకే తండ్రిని పిలవలేదన్నారు. తాగుడుకు బానిస అయిన తండ్రి పెట్టే ఇబ్బందులు అనుభవించిన వారికే తెలుస్తుందన్నారు.

కల్యాణ మండపానికి భూమిపూజ



కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం నాయకులు

చేళూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మిట్టేమరి గ్రామంలో బ్రాహ్మణసంఘం కల్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు భూమిపూజ నిర్వహించారు. గరుడాద్రి లక్ష్మనరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో చేళూరు తాలూకా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, ఇంద్రజాలం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. చింతామణి, చేళూరు, చిక్కబళ్ళాపుర, గుడిబండ, గౌరిబిదనూరు తదితర తాలూకాల నుండి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ బ్రాహ్మణులు ఏవైనా సమస్యలు ఉంటే సంఘం ద్వారా పరిష్కరించుకోవాలని, అందుకు సభ్యులందరూ కలసికట్టుగా ముందుకుసాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పేద బ్రాహ్మణులకు ఏదైనాఆర్థిక సహాయం అవసరమైనచో సహకారం అందిస్తామన్నారు.


నర్సులు సేవాభావం కలిగి ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ వీసీ కాంత

బెంగళూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో పుట్టుక మరణం దాకా నర్సుల సేవల ఆవశ్యకత ఉంటుందని వారు మానవత్వం, సేవాభావం కలిగి ఉండాలని మాజీ వైస్‌ఛాన్సులర్ ఎస్. కాంత అభిప్రాయపడ్డారు. యలహంక ఆదిత్య నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సు ప్రమాణాల ప్రత్యేక కార్యక్రమం జరిగింది. రాజీవ్‌గాంధీ మెడికల్ కళాశాల రిజిస్ట్రార్ రియాజ్‌బాషా, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బీఎ విశ్వనాథ్, వైస్‌ఛైర్మన్ ప్రియా విశ్వనాథ్‌లు పాల్గొన్నారు. బెంగళూరులో నర్సింగ్ కళాశాలలు వందల నుంచి వేల సంఖ్యకు పెరిగాయని అయితే ఆదిత్యలో ఉత్తమమైన విద్యావిధానం అందిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు.

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు



	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.55	1,577.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,386	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	326	138
నీటి నిల్వ (టీఎంసీలు)	7.69	3.45

కాంగ్రెస్ నాయకుల పూజలు



కనకదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

బళ్లారి రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): నగరంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ జన్మదినం సందర్భంగా దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేపీసీసీ మాధ్యమ వర్తకరు వెంకటేష్ హెగ్డే, మల్లేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హంపిలో చెక్‌పోస్టుల ఏర్పాటు



విరుపాక్షేశ్వర ఆలయం వద్ద తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో చారిత్రక ప్రసిద్ధిచెందిన హంపిలో అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. హంపిలోకి ప్రవేశించే 4 ప్రధాన రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యాటకులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతిస్తున్నారు. 24గంటల పాటు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. హంపిలోని ప్రధాన చారిత్రక కట్టడాలైన రాతి రథం, తదితర కట్టడాల వద్ద భద్రతా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. హంపి విరుపాక్షేశ్వర దేవాలయంలోకి ప్రవేశించే ప్రతి భక్తుడిని మెటల్ డిటెక్టర్‌లతో తనిఖీ చేసిన తరువాతే లోనికి అనుమతిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు మరింత భద్రతను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ధర లేక అన్నదాతల ఆందోళన



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న ధాన్యం రాసులు

బళ్లారి సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): ఈసారి రైతులు సాధారణం కంటే మెరుగైన పంటను పండించారు. దిగుబడి ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంది. ఎకరానికి రూ.30 వేల నుంచి 35 వేలు ఖర్చుచేసి పండించినా మార్కెట్లో మంచి ధర చూడాలని కలలు కన్నారు. అయితే మార్కెట్‌లో బియ్యం ధర రోజురోజుకూ తగ్గుతుండటంతో రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. బళ్లారి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రానికి రాని రైతులు, మార్కెట్లో 1800-1900 ధర ఉంది. తమకూరు,దావణగెరె ప్రాంతాల వ్యాపారుల నుంచి ధరలు ఆశిస్తున్న రైతులు ఇబ్బందుల్లో పడ్డారు. వర్షం, ఎండల భయం మధ్య విత్తిన వరి పంటకు మార్కెట్‌లో ఆశించిన ధర రాకపోవడంతో రైతులు ఈసారి కూడా కష్టాలను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, శ్రీరాములు

బళ్లారిరూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి మారెమ్మ జాతర సందర్భంగా గురువారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్, మాజీ మంత్రి శ్రీరాములు పాల్గొని పోటీలు ప్రారంభించారు. పోటీలు తిలకించేందుకు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. గ్రామ పంచాయతీ అధ్యక్షులు కావలి శివప్ప నాయక స్కూల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గురు సిద్దన్నగౌడ పాల్గొన్నారు.

ముంగారు సేద్యానికి అన్నదాత సిద్ధం..!

- ముందస్తు వర్షాలతో తడిసిన పుడిమితల్లి
- పొలం పనుల్లో రైతులు బిజీ



సండూరు తాలూకా వడ్డు గ్రామ పొలంలో సేద్యం చేస్తున్న రైతు

బళ్లారి, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో ముందస్తు సేద్యానికి అన్నదాతలు సిద్ధమయ్యారు. మే నెలలోనే మూడు దఫాలు భారీ వర్షాలు కురిశాయి. దీంతో పొలాలు బాగా తడిసిపోయాయి. రైతులు ఇప్పటికే భూములను దుక్కిదున్ని విత్తనం వేసేందుకు సమాయత్తమవుతున్నారు. విత్తనం కు భూమిని సదును చేసుకుంటున్నారు. ఏప్రిల్‌లో భూములను దుక్కిదున్ని ఎండడానికి వదిలేశారు. మేలో వర్షాలు బాగా కురుస్తుండడంతో రైతులు సేద్యం పనులు ప్రారంభించారు. బళ్లారి, విజయనగర, రాయచూరు. కొప్పళ, చిత్రదుర్గం జిల్లాల్లో వర్షాలు బాగా కురిశాయి. ఖరీఫ్‌లో వేరుశనగ, జొన్న, పత్తి పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. రైతులు పొలాల్లో సేద్యం చేయడం, కలుపు మొక్కలను తొలగించి చదును చేస్తున్నారు. సేద్యం చేసుకునేందుకు ఎద్దులు లేక రైతులు ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. కూలీలు కూడా ఎక్కువగా ఉండటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది అనుకున్నంతగా పంటలు పండలేదు. వానలు సకాలంలో కురియక పంట చేతికి అందలేదు. అప్పుడు కూడా పెట్టిన పెట్టుబడి చేతికి రాలేదు. ఈసారి పుడమితల్లి కరుణించకపోతుందా అనే ఆశతో పొలం పనులు సాగు చేస్తున్నామని కూడ్లిగికి చెందిన హనుమంత అనే రైతు చెబుతున్నాడు. విత్తనం వేయడానికి కనీసం రూ.25 వేల వరకు పెట్టుబడి అవుతుందని తెలిపారు. విత్తనం, ఎరువులు, కూలీలు, ఇలా అన్నీ కలిపి రూ.25 వేల వరకు ఎకరాకు పెట్టుబడి వస్తుందన్నారు. మేలో విత్తనం విత్తేందుకు సిద్ధం చేసుకుంటే జూన్ రెండోవారం లోపు వేరుశనగ, పత్తి, జొన్న పంటలు వేసేందుకు అనువుగా ఉంటుందని హువ్వినహడగలికి చెందిన రైతులు హనుమంతరాయప్ప, బసలింగనగౌడ తెలిపారు. పొలం పనులు చేసేందుకు కూలీలు కూడా దొరకడం లేదని, ఒకవేళ వచ్చినా కూలి ఎక్కువ అడుగుతున్నారని వాపోతున్నారు. రోజుకు మగవారికి రూ.1,000, ఆడవారికి రూ.800 కూలీ ఉందని తెలిపారు. ఇక సేద్యం చేయడానికి ఒక ఎకరాకు రోజుకు రూ.4 వేల వరకు అవుతుందని, అదే ట్రాక్టర్ ద్వారా టిల్లర్, ప్లౌవ్, లెవెలింగ్ చేస్తే గంటకు రూ.18 వందల వరకు ఉంటుందని తెలిపారు. అయినా వానలు బాగా పడుతున్నాయని, పంటలు విత్తుకుంటే పండుతాయ నే ఆశతో పొలాలు దుక్కిదున్నుకున్నామని రైతులు తెలిపారు. ప్రభుత్వం ముందుగానే విత్తనాలు సబ్సిడీతో సకాలంలో ఇస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు.

ఆక్రమిత కశ్మీర్‌ను పొందే అవకాశం ఆసన్నమైంది: మాజీ ఎంపీ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉగ్రప్ప

బళ్లారి సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి పొంది ఉగ్రవాదులను నిర్మూలించే సమయం ఆసన్నమైందని మాజీ ఎంపీ ఉగ్రప్ప అన్నారు. గురువారం ఆయన నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరితో సంప్రదించి కాల్పుల విరమణ ప్రకటించారని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో బయో-ప్రొద్యూసర్లను అణచివేయడం ద్వారా మన భారత సైన్యం పాకిస్థాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. కానీ కాల్పుల విరమణకు గల కారణాన్ని ప్రధాని మోదీ స్పష్టం చేయాలని ఆయన కోరారు. మధ్యప్రదేశ్ మంత్రి కల్నల్ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరి అనడం దారుణమన్నారు. అతనిని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భారత సైన్యం ప్రపంచంలోనే అత్యంత బలమైందన్నారు. అంతరగంగమ్మ కొండలోని 68.5హెక్టార్లలో మొత్తం 65,82,341 మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని ఓఎంసీ కొల్లగొట్టిందని అన్నారు. కర్ణాటక నుంచి 28లక్షల టన్నుల ఖనిజాన్ని గాలి జనార్దన్‌రెడ్డి కాజేశారన్నారు. ఈకేసులో రూ.884కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేశారని ఆరోపించారు. ఈకేసుకు సంబంధించి మాజీ మంత్రి జనార్దనరెడ్డి సహా ఐదుగురికి ఏడేళ్ల జైలుశిక్ష పడిందన్నారు. జనార్దనరెడ్డి నేరం చేయడానికి సహకరించిన మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, మాజీ మంత్రి బి.శ్రీరాములు ఏదో ఒక విధంగా దోషులుగా ఉండటం గురించి వారు ఏమంటారని ప్రశ్నించారు. నాయాకులు అసుండి నాగరాజగౌడ, వెంకటేశ్ హెగ్డే, టపాల ఏకాంబరం, ఎరుకలస్వామి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 36 మందికి గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం



బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బళ్లారి గాంధీనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 36 మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి... కొప్పళ జిల్లా, కారటిగి పోలీసుస్టేషన్ పరిధిలో మహిళా నరేగా కూలీలను తీసుకెళుతున్న టాటా ఏస్ వాహనాన్ని కేఎస్ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రమాదంలో 28మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని ఉన్నత చికిత్స కోసం కొప్పళ నగరంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని గంగావతి తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి శివరాజ్ తంగడిగి ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్సలు అందించాలను డాక్టర్లను ఆదేశించారు. కారటిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు

విజయనగరం జిల్లా మరియమ్మనహళ్ళి పారువనహళ్ళి గ్రామాల వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై వెళుతున్న ఎక్స్‌కవేటర్‌ను వీఆర్ఎల్ బస్సు ఢీకొనడంతో ఎక్స్‌కవేటర్ ఒపక్కకు ఒరిగింది. బస్సు మరోవైపు ఒరిగిపోవడంతో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురితోపాటు ఎక్స్‌కవేటర్ డ్రైవర్ వడ్డరహట్టికి చెందిన శరణప్ప, బస్సు డ్రైవర్ మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 32మంది ఉన్నారు. బెంగళూరు నుంచి యాదగిరి వెళుతున్న బస్సు శివమొగ్గ నుంచి గంగావతి వైపు వెళుతున్న ఎక్స్‌కవేటర్‌ను వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనలో రెండు రోడ్డుపక్కన 10 అడుగుల లోతులో పడిపోయాయి. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపక్కన ఒరిగిపోయిన ప్రైవేట్ బస్సు, ఎక్స్‌కవేటర్

లారీ, స్కూటర్ ఢీ.. రైతు మృతి



ప్రమాదానికి కారణమైన లారీ, నుజ్జయిన బైక్

కంప్లి, మే 15(ఆంధ్రజ్యోతి): స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో మహేష్(38) అనే రైతు మృతిచెందాడు. కురుగోడు పోలీసులు తెలిపిన మేరకు కురుగోడు తాలూకా ఎర్రంగళి గ్రామానికి చెందిన మహేష్ కరూరు గ్రామం నుంచి సోమసముద్రం మీదుగా ఎర్రంగళి గ్రామానికి బయలుదేరాడు. బళ్లారి, సిరుగుప్ప హైవే రోడ్డు, భాగ్యనగర్ క్యాంపు వద్ద బళ్లారి నుంచి సిరుగుప్పకు లారీ స్కూటీ మీద వెళుతున్న మహేష్‌ను ఢీకొంది. మహేష్‌కు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుప్రీత్ తెలిపారు.

నర్సరీ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కంప్లి, మే 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో నర్సరీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని తహసీల్దార్ నరసప్ప అన్నారు. గురువారం ఉద్యానవన శాఖాధికారులు, నర్సరీల యజమానులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. రైతులకు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఒక నిర్ణయం తీసుకున్నారు. నర్సరీ యజమానులు లైసెన్స్ కలిగి వుండటం తప్పనిసరి, జీఎస్టీ, నర్సరీ ముందు బోర్డు, లైసెన్స్ నంబరు, మొక్కకు ఉపయోగించే మందు పేరును ఉంచాలన్నారు. రిజిస్టర్‌ను రెండు రూపాల్లో రూపొందించాలరు. మొక్కల పెంపకం అందుకు అనుగుణంగా టార్పాలిన్ వుంచడం తప్పనిసరి అన్నారు రైతులకు మల్చింగ్‌తో పెంచిన మొక్కలను రూ.0.45 పైసలు, మల్చ్ లేకుండా నేలపై పెంచిన మొలకలకు రూ.0.40 చెల్లించాలని నిర్ణయించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నరసప్ప

హోసూరు జోన్

ఫాంహౌస్‌లోకి చొరబడి నగదు, నగలు చోరీ



ఫాంహౌస్ వద్ద గుమిగూడిన ప్రజలు

హోసూరు క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని తొట్టమెట్టూర గ్రామంలోని ఫాంహౌస్‌లోకి చొరబడిన దుండగులు ఇంట్లోనిక వ్యక్తులపై దాడి చేసి నగదు, నగలు దోచుకున్నారు. గ్రామంనుంచి ఒక కిలోమీటరు దూరంలో సజ్జలపట్టికి చెందిన రాజా, గోవిందమ్మాళ్ ఉంటున్నారు. వీరికి సుమారు 12 ఎకరాల భూమి ఉంది. బుధవారం రాత్రి రాజా, గోవిందమ్మాళ్‌తోపాటు వారి అల్లుడు రామచంద్రన్, మనవరాలు వర్షిణి ఉన్నవేళ కారులో ఏడుగురు వ్యక్తులు ముసుగులో ధరించి వచ్చారు. వారిలో ఒకరు గోవిందమ్మాళ్‌ను కత్తితో బెదరించగా మిగిలిన దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. రామచంద్రన్‌ను గాయపరిచి బీరువాలో వేర్వేరుగా ఉంచిన 8.40 లక్షల రూపాయల నగదు దోచుకున్నారు. కాగా ఆమెనుంచి నెక్లెస్, తాళిబొట్టు సహా సుమారు 85 గ్రాముల నగలను లాక్కెళ్ళారు. గాయపడిన రామచంద్రన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉద్దనపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

హోసూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మార్షల్‌ఆర్ట్స్‌లో హోసూరు విద్యార్థులు రాణించారు. విలుప్పురం జిల్లా తిండివనంలో రెండురోజులపాటు రాష్ట్రస్థాయి ఉషు మార్షల్స్ ఆర్ట్స్ పోటీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 700మంది పోటీల్లో పాల్గొన్నారు. జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ తదితర పోటీలు సాగాయి. శంషు విభాగంలో జాన్‌రాస్, కిశోర్‌లు బంగారు పతకాన్ని సాధించగా, గోపిశ్రీ, సతీశ్‌లు కాంస్య పతకాన్ని గెలుపొందారు. ప్రధాన కోచ్ జయకుమార్ మాట్లాడుతూ వీటిలో రాణించిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే స్పోర్ట్స్ కోటాలో వీరికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులతోపాటు ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, ఎయిర్‌ఫోర్స్, ఐటీబీపీ తదితర వాటి ఎంపికకు సులభతరం కానుందన్నారు.



పతకాలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు



బోల్తాపడిన వ్యాన్

వ్యాన్ బోల్తా.. 22 మందికి గాయాలు

హోసూరు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): డెంకణీకోట సమీపంలో వ్యాన్ బోల్తా పడిన ఘటనలో 22మంది గాయపడ్డారు. కృష్ణగిరి జిల్లాలోని అంచెట్టి సమీపంలోని తాండియం గ్రామంనుంచి 22మందితో ప్రయాణిస్తున్న వ్యాన్ గురువారం ఉదయం డెంకణీకోటవైపు వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన అందరినీ 108 అంబులెన్స్ ద్వారా డెంకణీకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మాట్లాడుతున్న మంత్రి మహంకాళ ఎస్ వైద్య

ప్రతి మత్స్యకారుడికీ సొంత ఇల్లు

- మంత్రి మహంకాళ ఎస్ వైద్య

సిరుగుప్ప, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి మత్స్యకారుడికి సొంత ఇల్లు నిర్మిస్తామని మత్స్య శాఖ మంత్రి మహంకాళ ఎస్ వైద్య అన్నారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో ఆయన పర్యటించారు. తాలుకా పంచాయతీ భవనంలో రెండేళ్ల పూర్తయిన ప్రభుత్వ సాధనాల సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తాలుకాలోని చిందనూరు మార్గంలో మత్స్యకారులకు ప్రత్యేక చేపల మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డిప్యూటీ సీయం డీకే శివకుమార్ నిరుపేదల అభివృద్ధి కోసం ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నారని, మరెన్నో పథకాలను ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు తెలిపారు. 20వ తేదీ హోస్పేట నగరంలో లక్ష మందికి భూమి పట్టాలు ఇస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎం నాగరాజు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పిడుగుపాటుకు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి రూ.5 లక్షలు చొప్పున చెక్కులు అందజేశారు. విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలుడికి కూడా ప్రభుత్వం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అభయాంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రికి నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, వెంకటేష్‌లు శా లువా, పూలమాలలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దమ్మూ రు సోమప్ప, కౌన్సిలర్ గణేష్, నజీర్, మోహిద్దీన్, పవన్ కుమార్ దేశాయి, సీనియర్ నాయకులు బాలప్ప, మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించండి



భాస్కర్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న మాదిగ సమాజ ప్రముఖులు

కంప్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మాదిగ సమాజానికి ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని ప్రత్యేక రిజర్వేషన్ సమితి రాష్ట్ర సంచాలకులు భాస్కర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మాదిగ సమాజం కోసం ప్రత్యేక రిజర్వేషన్ సాధనకు రథయాత్ర కంప్లికి రావడంతో గణపతి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక మాదిగ రిజర్వేషన్ విషయంపై నిర్లక్ష్యం వస్తున్నారని ఆరోపించారు. ఇలానే కొనసాగితే రానున్న కాలంలో మాదిగ సమాజం రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల సమయంలో సరైన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. అంతకుముందు భాస్కర్ ప్రసాద్‌ను కౌన్సిలర్ మాదిగ సమాజం ప్రముఖులు వీరాంజనేయులు గజమాలతో సన్మానించారు. పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్, వీరాంజనేయులు, హనుమంతు, డిష్ ప్రసాద్, లక్ష్మీపతి, గుండప్ప, రామయ్య, బుజ్జి కుమార్ గంగన్న, మారెన్న కుమార్, మరియప్ప, నాగరాజు, శ్రీనివాస కుమారస్వామి పాల్గొన్నారు.

ఆయుష్ కార్యాలయం ఖాళీ..!

- నలుగురు అధికారుల్లో ముగ్గురు సస్పెన్షన్

బళ్లారి గాంధీనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి బళ్లారి జిల్లా ఆయుష్ కార్యాలయం ఖాళీ అయ్యింది. బళ్లారి, విజయనగర ఉభయ జిల్లాల పరిధిలో ఉన్న ఆయుష్ శాఖలో మందులు, సామగ్రి కొనుగోలులో జరిగిన అవినీతి అక్రమాల నేపథ్యంలో ఆయుష్ అధికారి డాక్టర్ సరళాదేవితో పాటు పరిపాలనాధికారి శరణప్ప జినగ, సూపరింటెండెంట్ ఖలందర్‌లను ప్రభుత్వ కార్యదర్శి శ్రీపతి పికె సస్పెండ్ చేశారు. ప్రస్తుతం కార్యాలయంలో జ్యోతి అనే క్లర్క్, ఔట్‌సోర్స్‌పై పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారు. కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై మార్చి 27వ తేదీన అసిస్టెంట్ డైరెక్టర్ తనిఖీలు చేపట్టి ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ప్రాథమిక దశలో అవినీతి జరిగినట్లు తేలడంతో అందుకు బాధ్యులను చేస్తూ ముగ్గురు అధికారులు సస్పెండ్ అయ్యారు.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్

- యువకుడిపై కేసు నమోదు

రాయచూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్‌చేసిన సింధనూరు తాలూకా తుర్విహాళ్‌లో కే హొసళ్ళి గ్రామానికి చెందిన యువకుడు అజ్మీర్‌పై కేసు నమోదు చేసినట్లు తుర్విహాళ్ ఎస్ఐ సుజాత తెలిపారు. రఫేల్‌యుద్ధ విమానం ప్రధాని మోదీపై దూసుకెళుతున్నట్లు తన ఫేస్‌బుక్ ద్వారా పోస్టింగ్ చేశాడన్న ఆరోపణ మేరకు యువకుడు అజ్మీర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్నం హత్య నిందితుడిని అరెస్టు చేయాలి



ఏసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయచూరు, మే 15(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులకు గురి చేసి మహిళ మృతికి కారకుడైన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశారు. బాధితులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు నిందితుడిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న లింగసుగూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. బాధితుల తరపున గురువారం లింగసుగూరులో ర్యాలీ నిర్వహించిన ఎస్ఎఫ్ఐ బాధిత కుటుంబ సభ్యులు పోలీసుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. లింగసుగూరులో సహాయ కమిషనర్ కార్యాలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లిన బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని అధికారి వద్ద వెళ్లబోసుకున్నారు. శాంతలా అనే మహిళకు 2020లో పెళ్లి అయ్యిందన్నారు. అప్పటి నుంచి వరకట్నం పేరుతోనూ, పిల్లలు కాలేదన్న నెపంతో శారీరకంగా, మానసికంగా హింసించారని, ఆమె చావుకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం

రాయచూరు, మే 15(ఆంధ్రజ్యోతి): సరిహద్దు రక్షణలో గాయపడి చికిత్స పొందుతున్న సైనికుల కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం నగరంలోని అమరేశ్వర ఆస్పత్రి వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పెద్ద ఎత్తున యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సైన్యం సేవలు మరవలేనివన్నారు. భారత సైన్యానికున్న శక్తిసామర్థ్యాలు మరోసారి రుజువయ్యాయన్నారు. 1971లో జరిగిన పాకిస్థాన్ యుద్ధంలో అప్పటి సైనికులు చూపిన సాహసం ఆ నాటి ప్రధాని ఇందిరా తీసుకున్న నిర్ణయాలను శ్లాఘిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు.



రక్తదానం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు